క్లుప్తంగా

నేడు టంగుటూరులో జగనన్న సురక్ష

టంగుటూరు: మండల కేంద్రమైన టంగుటూరు-1, 2 సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అదించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం చేస్తున్న సర్పంచ్ టి సురేష్‌బాబు

వెలిగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 1998 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసింది. ఈ నేపథ్యంలో వెలిగండ్ల ప్రాథమిక పాఠశాల(సీపీ)కి టి. దయాకర్‌ను నియమించారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు టి దయాకర్, ప్రధానోపాధ్యాయులు చల్లా సత్యనారాయణను సర్పంచ్ టి. సురేష్ బాబు ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో రాత్రిళ్లు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివనాగరాజు

హనుమంతునిపాడు: రాత్రిళ్లు గ్రామస్తులు అమత్తంగా ఉండాలని ఎస్సై శినాగరాజు సూచించారు. మండలంలోని మంగళవారం కిష్టంపల్లిలో మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన కొత్త వ్యక్తులు తిరుగుతున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో రాత్రిలు ఆరుబయట ఒంటరిగా నిద్రించరాదన్నారు. ఇళ్లకు తలుపులు వేసి తాళాలు వేయాలన్నారు. సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ వినియోగించుకోవాలి



వైద్యపరీక్షలు డాక్టర్ రుబీనా

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 104 వాహనం ద్వారా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రుబీనా అన్నారు. మండల కేంద్రమైన పామూరు విరువూరురోడ్డులో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుబ్బరాయుడు, హెచ్ఈ సుబ్రమణ్యం, మౌనిక, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పంపిణీకి సిద్ధంగా సమీకృత దానా

మర్రిపూడి: మండల రైతులకు 60 శాతం రాయితీపై సమీకృత దానా, 50 శాతం రాయితీపై ప్రభుత్వం జొన్న విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారిణి శ్రావణి మంగళవారం తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 3.6 టన్నుల సబ్సిడీ జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పశుపోషకులకు 50 శాతం సబ్సిడీ పై 5 కిలోల ప్యాకెట్ రూ.89.38 చొప్పున అత్యధికంగా 20 కిలోల వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పశుగ్రాసం సాగు చేసే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం నకలుతో ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. 200 కిలోల దానా రూ.1300కు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పీరాపురం(కొండపి): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం పీరాపురం, ఎస్ఎన్ కండ్రిక గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అశోక్‌బాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో కలిగిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. సీఎం జగన్ నిర్ణయాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు దోపిడీ చేయడం, పచ్చనేతలకు పంచిపెట్టడం తప్ప సామాన్య ప్రజలకు చేసిందేమీలేదన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ప్రతి గపడలో లబ్ధిదారులు సంతోషంగా చెబుతున్నారన్నారు. ప్రతి ఇంటినీ జల్లెడపట్టి మరీ అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించడం దేశంలో కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, జగనన్నకే సాధ్యమైందన్నారు. ముందుగా అశోక్‌బాబుకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ బొట్లగుంట మాల్యాద్రి, మారంరెడ్డి గంగాధర్, ఎల్లావుల శ్రీనివాసరెడ్డి, బెల్లం సత్యన్నారాయణ, నల్లూరి సురేంద్ర, రామచంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో నోటీస్ బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్ఓ, సర్వేయర్

వెలిగండ్ల: ఇటీవల జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ స్థలాలు అక్రమణలకు గురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి కలెక్టర్‌కు, జేసీకి ఫిర్యాదు చేశారు. జేసీ స్పందించి ఆక్రమణలకు గురైన స్థలంలో హద్దురాళ్ల తొలగించి, ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. మండల కేంద్రమైన వెలిగండ్లలోని సర్వే నం 349/2లోని ఉన్నది ప్రభుత్వ భూమి అని ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే వారు చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని ప్రభుత్వ నోటీసుబోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ చిలకల నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు వీఆర్ఓ బెంజిమెన్, సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఆ భూమిలో సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉన్నంతవరకు రియల్టర్లు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించారు.

విప్లవవీరుడు అల్లూరికి ఘన నివాళి



అనంతవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, నాయకులు

టంగుటూరు: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎంపీడీఓ రత్నజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో మంగవారం అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాలను త్యజించి విప్లవ స్ఫూర్తిని రగిల్చారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, ఏపీఎస్ రాజు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, మర్రి భాస్కర్, శారీమందిర్ వెంకటేశ్వర్లు, జిల్లా చంద్రశేఖర్, కన్నా వెంకట్రావు, రాజు వేణుగోపాల్‌రెడ్డి, వీఆర్వో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

హనుమంతునిపాడు: మండలంలోని కూటాగుండ్ల, వేములపాడు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష జరుగుతుందని ఎంపీడీఓ జీవీ కృష్ణారావు తెలిపారు. ఎంపీడీఓ బృందం కూటాగుండ్ల గ్రామ సచివాలయంలో, తహసీల్దార్ ఎస్ హరిబాబు బృందం వేములపాడు సచివాలయంలో పాల్గొంటారన్నారు. అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది,ప్రజలు హాజరు కావాలని కోరారు.

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, నేరేడుపల్లి గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష నిర్వహిస్తామని ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓలు రెండు బృందాలుగా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని కోవిలంపాడు, నల్లమడుగులలో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ఆయా సచివాలయల పరిధిలోని ప్రజలు ప్రభుత్వ పథకాల్లో అర్హులై లబ్ధిపొందని వారు పరిష్కారం పొందగలరన్నారు.

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు, పి.రాళ్లపల్లి పంచాయతీల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సుకుమార్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి తెలిపారు. ఇమ్మడిచెరువులో ఎంపీడీఓ బృందం, పి.రాళ్లపల్లిలో తహసీల్దార్ బృందం పాల్గొంటారన్నారు. ప్రజలు జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నలుగురు జూదరులు అరెస్టు

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామ శివారులో పేకాట స్థావరంపై సెబ్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.19,210 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని సింగరాయకొండ పోలీసు స్టేషన్లో అప్పగించారు. దాడిలో సెబ్ జేడీ టీం ఎస్సై శివప్రసాద్, సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా పొగాకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: అక్రమంగా పొగాకు విక్రయించినా, కొనుగోలు చేసినా లైసెన్సులు రద్దు చేస్తామని రైతులు, వ్యాపారులను వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రైతులు, వ్యాపారులతో ఆయన మాట్లాడారు. పొగాకు రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలని, పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, మినుము సాగు చేసి పొలంలో కలియదున్నితే అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. కాగా స్థానిక వేలం కేంద్రానికి చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 1,132 బేళ్లు తీసుకురాగా 1,050 కొనుగోలయ్యాయి. 82 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.246, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.231.93 పలికింది. వేలంలో మొత్తం 34 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శేషమ్మ

హనుమంతునిపాడు: పంట మార్పిడితో రైతులు ఆశించిన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వి. శేషమ్మ, వ్యవసాయాధి కారి శైలజ అన్నారు. మంగళవారం దొడ్డిచింతల, కూటాగుండ్ల రైతు భరోసా కేంద్రాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముందుగా సంఘాల రైతుల నుంచి ఏఏ పంటలు సాగు చేస్తారు, ఎకరాకి ఎంత దిగుబడి వస్తుంది. ఏ రకం విత్తనాలు, ఎరువులు వాడకం గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా రైతులు సాగు సమంలో, విత్తన విత్తు సమయంలో, పంట దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సలహాలు సూచనలిచ్చారు. ఒకే పంట సాగు చేయడం వల్ల భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపిస్తుందన్నారు. విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. రైతుల ఉత్పత్తి దారుల సంఘాల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏఓ గోపిక్రిష్ణ, వీఏఏలు కాశయ్య, కొండలు, నవ్య, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సందీప్ అన్నారు. స్థానిక ఆస్పత్రిలో మంశవారం ఆరోగ్య సిబ్బందికి, ఎంఎల్ హెచ్‌పీలకు సమీక్ష మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సచివాలయ పరిధిలో ఎంఎల్‌పీ హెచ్ఓలు ప్రజలకు అందుబాటులోఉండి వైద్య సేవలందించాలన్నారు. వర్షాకాలు సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నీవారణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే నిర్వహించారు. ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్ హెచ్‌పీలు ప్రజలకు మంచి వైద్య సేవలందించాలన్నారు. సీహెచ్ఎం కేవీ చెన్నయ్య, సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నగదుతో వాటర్ వెహికల్ బాయ్ పరారీ?

కనిగిరి రూరల్: పట్టణంలోని ఓ వాటర్ కంపెనీ సేల్ డిస్ట్రిబ్యూటర్ పాయింట్ వెహికల్ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడు ఖాతాదారులిచ్చిన నగదును యజమానికి చెల్లించకుండా తీసుకుని పరారైనట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు.. పట్టణంలోని కొత్తూరు వద్ద ఉన్న వాటర్ డిస్ట్రిబ్యూటర్ పాయింట్‌లో స్థానిక ఎన్జీఓ కాలనీకి చెందిన యువకుడు వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను గతకాలంగా వాటర్ బాటిల్ తీసునే ఖాతాదారుల నుంచి నగదును తీసుకుని యజమానికి చెల్లించకుండా పరారైనట్లు తెలిసింది. పరారైన యువకుడు కనిగిరి, పొదిలి పట్టణాలకు చెందిన ఖాతాదారుల నుంచి సుమారు రూ.10 లక్షల నగదును తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు వాటర్ డిస్ట్రిబ్యూటర్ పాయింట్ యజమాని, మరో ఇద్దరు ఖాతాదారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై ఎస్సై దాసరి ప్రసాద్‌ను వివరణ కోరగా. ఎటువంటి ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదు వస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

కంభం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువతిని గర్భవతిని చేసిన యువకుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. కంభంకు చెందిన షేక్ మహమ్మద్ సైపుల్లా అనే వ్యక్తి ఇదే గ్రామానికి ఓ యువతిని ప్రేమించి సహజీవనం చేసి గర్భిణిని చేసినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సదరు వ్యక్తిని అరెస్టు చేసి గిద్దలూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యపై చైర్మన్ హామీ



విద్యుత్ అధికారులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మున్సిపాలిటీలోని నాల్గవ వార్డు చింతలపాలెంలోని ప్రజలు విద్యుత్ సమస్యపై మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తక్షణ అక్కడకు వెళ్లి విద్యుత్ అధికారులతో, గ్రామస్తులతో మాట్లాడారు. చింతలపాలెంలో తరుచూ తలెత్తుతున్న విద్యుత్ సమస్య పరిష్కారంకు ఎస్ఈతో మాట్లాడారు. నాల్గు రోజుల్లో చింతలపాలెంల ఫీడర్‌లోని విద్యుత్ సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకుంటానని హామీ ఇప్పించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు రామనబోయిన ప్రశాంతి శ్రీనివాస్, స్థానిక నాయకులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నీచర్ అందజేత

పామూరు: కాపు సంఘ నాయకుడు వంగవీటి మోహన్ రంగా జయంతిని పురస్కరించుకొని మండల కాపు సంఘం, రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో రూ.22 వేల సొంత నిధులతో దాత ఆకుపాటి వెంకటేష్ ఫర్నీచర్‌ను అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేశారు. అదే విధంగా వైద్యశాలల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు. ముందుగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.